సాక్షి
జనగామ
బుధవారం ¦ 25 ¦ సెప్టెంబర్ ¦ 2024



సీక్రెట్‌గా వీడియో తీశారు

ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో తనను బెదిరించి వీడియోలో మాట్లాడించారని కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడు రాహుల శ్రీనివాస్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. - 8లో▸



పత్తికి ఆపతి..

- 8లో▸

ప్రస్తుతం పత్తి పంటను రసంపీల్చే పురుగులు ఆశించి తీవ్ర నష్టం కలుగజేస్తున్నాయని. రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మల్యాల కేవీకే శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

గరిష్టం/కనిష్టం
$30^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. అల్పపీడన ప్రభావంతో పలు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పోషకాహారం తీసుకోవాలి



బచ్చన్నపేట: ప్రతిఒక్కరూ తమ దిన చర్య భోజనంలో పోషకాలు గల ఆహార పదార్థాలను తీసుకోవాలని, అప్పుడే ఆరోగ్యంగా జీవిస్తారని జెడ్పీ సీఈఓ సరిత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో అందుబాటులో ఉండే అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులను పంపించాలని, అక్కడ ఎత్తుకు తగ్గ బరువును చూసి అవసరమైన పౌష్టికాహారాన్ని అందిస్తారన్నారు. ఈ సందర్భంగా 30 మంది గర్భిణులకు దాత కేబీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు కొండి వెంకట్‌రెడ్డి చీరలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్, ఐసీడీఎస్ సీడీపీఓ రమాదేవి, ఎంపీడీఓ మల్లికార్జున్, మండల వైద్యాధికారి సృజన, ఏపీఎం నాగేశ్వర్‌రావు, సూపర్‌వైజర్ మనోహర, ఎంఆర్‌ఐ శ్రీనవాస్‌రావు, నాయకులు కొండి వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిల్పూరుగుట్ట హుండీ ఆదాయం రూ.11.71లక్షలు



చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీల ఆదాయం రూ.11,71,350 లక్షలు వచ్చినట్లు ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ మోహన్‌బాబు తెలిపారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో దేవాదాయ శాఖ భువనగిరి డివిజన్ అధికారి ఎంవీ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో 5 నెలల 24 రోజులకు సంబంధించిన హుండీల ఆదాయాన్ని లెక్కించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు రవీందర్‌శర్మ, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, అర్చకులు రంగాచార్యుల, కృష్ణమాచార్యులు, శ్రీలక్ష్మీవేంకటేశ్వర సేవా సమితి, శ్రీలక్ష్మీశ్రీనివాస, వైష్ణవి సేవా సమితి, ఆలయ సిబ్బంది లెక్కింపులో పాల్గొన్నారు. అనంతరం భక్తుల సమక్షంలో అష్టదళ పాద పద్మారాధన పూజ నిర్వహించారు.

ఘనంగా సయ్యద్ యాకూబ్ షావలి ఉత్సవాలు



జనగామ: జిల్లా కేంద్రం హైదరాబాద్ రోడ్డులోని దర్గాలో సయ్యద్ యాకూబ్ షావలీ ఉర్సు ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. వేడుకల్లో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేను కమిటీ నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున లింగయ్య, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్‌రెడ్డి, కౌన్సిలర్లు ముస్త్యాల దయాకర్, జూకంటి లక్ష్మీశ్రీశైలం, నాయకులు బాల్దె సిద్ధిలింగం, సందీప్ తదితరులు ఉన్నారు.

ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా ప్రమోద్



జనగామ: జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా గంగిశెట్టి ప్రమోద్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఎన్నికల అధికారి అరిగిరి వెంకటేశ్ ఆధ్వర్యంలో ఇరుకుల రామకృష్ణ పర్యవేక్షణలో ఎలక్షన్ ప్రక్రియ జరిగింది. గంగిశెట్టి ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు వారు ప్రకటించారు. అనంతరం ప్రమోద్‌కుమార్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తాజా,మాజీ జిల్లా అధ్యక్షుడు పార్శికమల్ కుమార్, జైన రమేష్, బుచ్చిబాబు, జొన్నల రాజేశ్వర్, మహంకాళి హరిచంద్ర గుప్త, గోపయ్య, లింగయ్య, జయహరి పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

లింగాలఘణపురం: పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు దృష్టి సారించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీదేవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ రిజిస్టర్, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పీహెచ్‌సీల్లో ప్రసవాలు చేయించుకునే విధంగా ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు అవగాహన కల్పించాలన్నారు. పీహెచ్‌సీలో సిబ్బంది నియామకానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

‘ప్రశాస్త్’తో ప్రయోజనం

దివ్యాంగుల గుర్తింపునకు ప్రత్యేక యాప్

- అర్హత కలిగిన వారికి ప్రభుత్వ సౌకర్యాలు
- రేపటి నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సర్వే
- జిల్లాలో 81వేలకు పైగా విద్యార్థులు




శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

జనగామ: చిన్న చిన్న లోపాలతో జన్మించి.. వైద్య పరీక్షల ద్వారా నయమయ్యే పరిస్థితి ఉన్నప్పటికీ... అవగాహన లేమితో భవిష్యత్ అంధకారంమై పోతుంది. పెరిగి పెద్దయ్యే కొద్ది దివ్యాంగత్వం కూడా ముదిరి పోతూ జీవిత కాలం బాధపడే పరిస్థితి చాలా మందిలో చూస్తూనే ఉంటున్నాం. భావి భారత పౌరులుగా ఎదుగ బోతున్న బాలల సంరక్షణకు చిన్న తనంలోనే దివ్యాంగత్వాన్ని గుర్తించడంతో పాటు అర్హత కలిగిన వారికి సర్కారు పరంగా అందించాల్సిన సౌకర్యాలను కల్పించేందుకు కేంద్రం నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ (ఎన్‌సీఆర్‌టీ), తెలంగాణ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ‘ప్రశాస్త్’ యాప్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చారు.

ఉపాధ్యాయులకు శిక్షణ..

ప్రశాస్త్ యాప్ ద్వారా పిల్లల్లో వైకల్యాన్ని ఎలా గుర్తించాలనే దానిపై జిల్లాలోని ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు గత రెండు రోజులుగా శిక్షణ ఇస్తున్నారు. ఈ సదస్సు నేటితో (బుధవారం) ముగియనుంది. ఉపాధ్యాయులు ఈ నెల 26వ తేదీ నుంచి అక్టోబర్ 26వ తేదీ వరకు పాఠశాల్లోని ప్రతీ విద్యార్థిని స్క్రీనింగ్ పరీక్షలు చేసి వైకల్యంతో బాధపడే విద్యార్థులను గుర్తించాలి. రెండవ దశలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు (ఐఆర్‌పీ) అక్టోబర్ 26 నుంచి నవంబర్ 14 వరకు ఉపాధ్యాయులు గుర్తించిన పిల్లలను రీ సర్వే చేసి, వైకల్యం ఉన్న వారిని ఆస్పత్రికి రెఫర్ చేస్తారు. మూడో దశలో అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో ప్రతి పిల్లవాడిని పరీక్షించి, వైకల్యం ఉందని నిర్ధారిస్తే సదరం సర్టిఫికెట్‌తో పాటు ప్రభుత్వ పరంగా రావాల్సిన సౌకర్యాలను అందిస్తారు. ఒక వేళ వైకల్యం తగ్గించే అవకాశం ఉందని గుర్తిస్తే తల్లిదండ్రుల సూచన మేరకు ముందుకు వెళతారు. జిల్లాలో 341 పీఎస్, 64 యూపీఎస్, 103 ఉన్నత, 12 కేజీబీవీ, 8 మోడల్ పాఠశాలలు ఉండగా... 81వేలకు పై చిలుకు విద్యార్థులు ఉన్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి అందరూ సహకరించాలని విద్యాశాఖ అధికారులు కోరుతున్నారు.

యాప్ ఎలా పనిచేస్తుందంటే..



ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, ఇంటర్ విద్యాసంస్థల్లో వైకల్యం (దివ్యాంగులు) స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. పిల్లల్లో మానసిక ఎదుగుదల, వైకల్యం, ఆరోగ్య పరంగా ఫిట్‌నెస్ ఎలా ఉందనే దానిపై ‘ప్రశాస్త్’ (ప్రీ అసెస్మెంట్ హోలిస్టిక్ స్క్రీనింగ్ టూల్) తదితర పరీక్షలు నిర్వహిస్తే.. చిన్న తనంలోనే రోగాన్ని గుర్తించి, పిల్లల ఎదుగుదలలో ఆరోగ్య సమస్యలు రాకుండా చేసే అవకాశం ఉంటుంది. ఇందులో 21 రకాల వైకల్యాలకు సంబంధించి 60 ప్రశ్నలను రూపొందించారు. వీటి ద్వారా సదరు విద్యార్థులను ప్రశ్నిస్తూ... వారిలో ఉన్నలోపాలను ఈ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. దీంతో ప్రాథమిక దశలో ఉన్న వైకల్యాన్ని నయం చేసే అవకాశం ఉంటుంది. పుట్టుకతోనే వైకల్యంతో ఉన్న పిల్లలకు మాత్రం మూడు దశల్లో స్క్రీనింగ్ చేసి.. సర్కారు పరంగా రావాల్సిన సౌకర్యాలను అందించి... భరోసా కల్పిస్తారు. డీఈఓ రామ్ ఆదేశాల మేరకు సమగ్ర విద్య, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ బోనగిరి నర్సింహారావు ఆధ్వర్యంలో ప్రశాస్త్ యాప్ సేవలను క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు.

రేపటి నుంచి మొదటి దశ స్క్రీనింగ్..



ఈ నెల 26వ తేదీ నుంచి ప్రశాస్త్ యాప్ సేవలు ప్రారంభం కానున్నాయి. మూడు దశల్లో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో వైకల్యం, తదితర పరీక్షలకు సంబంధించి స్క్రీనింగ్ చేస్తారు. నవంబర్ 14వ తేదీన రెండవ దశ రీ వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న తర్వాత మూడో ఫేస్‌లో వైద్యులు పరీక్షిస్తారు.

\- రామ్, జిల్లా విద్యాశాఖ అధికారి

పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, వాహనదారులు



జోరు వాన

- జిల్లాలో 9.9 మిల్లీమీటర్ల వర్షపాతం
- జలమయమైన రోడ్లు



వర్షంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కుటుంబం



వర్షంలో తడుస్తూ వెళ్తున్న మహిళలు

జనగామ: జిల్లాలో వారం రోజులుగా మినీ ఎండా కాలాన్ని తలపిస్తూ.. ఉక్కపోతతో ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వాతావరణం...మంగళవారం సాయంత్రం కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది. వాతావరణంలో నెలకొన్న విచిత్ర పరిస్థితులతో సంపూర్ణ ఆరోగ్యవంతులు సైతం అనారోగ్యాల బారిన పడుతున్నారు. మంగళవారం జోరు వర్షంతో వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. జనగామ జిల్లా కేంద్రం హైదరాబాద్ రోడ్డు మరోసారి జలమయంగా మారింది. కొద్దిపాటి వానకే ఇటువంటి పరిస్థితి దాపురిస్తే... భారీ వర్షాలు కురిస్తే ఎలా అనే సందేహాలను పట్టణ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలో సరాసరి 9.9 మిల్లీ మీటర్ల వర్షం పాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. దేవరుప్పులలో అత్యధికంగా 114 మి.మీ, లింగాలఘణపురం 20.5, కొడకండ్ల 18.0, జనగామలో 13.8, పాలకుర్తిలో 5.8, స్టేషన్‌ఘన్‌పూర్, తరిగొప్పులలో 0.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

‘డబుల్’ పనులు త్వరగా పూర్తి చేయాలి



కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి: నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి కలెక్టర్ రిజ్వాన్ బాషాను కోరారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని, నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు ఆక్రమణలు జరిగాయని, పోలీస్, రెవెన్యూ అధికారుల సమన్వయంతో తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గంలో 2,505 డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు కాగా 924 పూర్తయ్యాయని, 414 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా 315 మందికి కేటాయించడం జరిగిందన్నారు. 590 మంది లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉందని, త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమవేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ రోహిత్‌సింగ్, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ వెంకన్న, హౌసింగ్ ఈఈ దామోదర్‌రావు, పాలకుర్తి సీఐ గట్ల మహేందర్ రెడ్డి, వివిధ మండలాల తహసీల్దార్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

వీధి కుక్కల జనన నియంత్రణ పూర్తి చేయండి

- అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

జనగామ రూరల్: వీధి కుక్కల స్టెరిలైజేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లాలోని చంపక్ హిల్స్ పరిధిలో ఉన్న ఏబీసీ జంతువుల జనన నియంత్రణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంలోని 30 వార్డుల్లో ఉన్నటువంటి వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ఏబీసీ సెంటర్‌లో పరిశుభ్రత చర్యలు పాటించాలని సానిటరీ ఇన్స్‌స్పెక్టర్‌కు సూచించారు. జిల్లాలో దాదాపుగా 1,200 వరకు వీధి కుక్కలు ఉన్నాయన్నారు. అనంతరం స్థానిక మాతా, శిశు ఆస్పత్రిలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మహిళా శక్తి క్యాంటీన్‌ను సందర్శించి, పర్యవేక్షించారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌లోని సీటింగ్, వంట గదిని పరిశీలించారు. ప్రతి రోజూ 200 మంది వరకు ఈ క్యాంటీన్‌ను వినియోగించుకుంటారని, రూ. 8 లక్షలతో క్యాంటిన్‌ను నిర్మించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ వసంత, అడిషనల్ డీఆర్డీఏ (సెర్ప్) శ్రీనివాస్, ఎంసీహెచ్ సూపరింటెండెంట్ మధుసూదన్ రెడ్డి, సానిటరీ అధికారి గోపయ్య, అసిస్టెంట్ ఇంజనీర్ ఏ. మహిపాల్, మహిళా శక్తి క్యాంటీన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం తగదు

- డీపీఓ స్వరూప



డీపీఓకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీడీఓ అరవింద్, సిబ్బంది

నర్మెట: వందశాతం పన్నుల వసూలు లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని, పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం తగదని డీపీఓ నాగపురి స్వరూప అన్నారు. నర్మెట గ్రామ పంచాయతీని మంగళవారం ఆకస్మిక తనిఖీ చేసిన ఆమె రికార్డులను పరిశీలించి ఎంపీడీఓ బి.అరవింద్ చౌదరి, కార్యదర్శి కందకట్ల శ్రీధర్‌లకు పలు సూచనలు చేశారు. ఇంటి పన్నులు, నల్లా బిల్లులు, వారాంతపు సంత కిస్తులు, వృత్తి వ్యాపార లైసెన్స్‌ల పన్నులు వంద శాతం వసూలు చేయాలని, పన్నులు చెల్లించని వారి సామగ్రిని జప్తు చేయాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా ట్యాంకుల క్లోరినేషన్ క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. తొలిసారి మండల కేంద్రానికి వచ్చిన డీపీఏకు అధికారుల సన్మానించి పుష్పగుచ్ఛ అందజేశారు. ఆమె వెంట బిల్ కలెక్టర్ చిర్ర వెంకట్ రెడ్డి తదితరులున్నారు.

ఓటరు నమోదును పారదర్శకంగా నిర్వహించాలి

- వీసీలో సీఈఓ సుదర్శన్‌రెడ్డి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్, అధికారులు

జనగామ రూరల్: ఓటరు నమోదు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని చీఫ్ ఎలక్టోరల్ అధికారి (సీఈఓ) సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల కార్యాలయం హైదరాబాద్ నుంచి ఎన్నికల అధికారులు, ఎస్‌ఎస్‌ఆర్, ఈఆర్‌ఓతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఓటరు నమోదుకు చేపట్టిన ఇంటింటి సర్వే పని తీరు మెరుగుపడిందని, ఇప్పటి వరకు 90శాతంపైగా సర్వే పూర్తయిందన్నారు. ఈ నెలాఖరు వరకు వంద శాతం సర్వే పూర్తి చేసి పెండింగ్‌లో ఉన్న ఓటరు నమోదుకు దరఖాస్తులు పూర్తి చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ ప్రక్రియ, డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రచురణ అక్టోబర్ 29లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు క్షేత్రస్థాయిలో స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం కలెక్టర్ రిజ్వాన్‌బాషా మాట్లాడుతూ జనగామ, పాలకుర్తి, ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గాల్లో బీఎల్‌ఓలు ప్రతీ ఇంటిని సందర్శించి, ఓటరు జాబితాకు సంబంధించిన మార్పులు, చేర్పుల గురించి ఓటర్లకు వివరించాలన్నారు. మరణించిన ఓటర్లను తొలగించడం, ఫొటో గుర్తింపు కార్డుకు సంబంధించి సరిగాలేని ఫొటోలను సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఘనపూర్ (స్టేషన్) ఆర్డీఓ వెంకన్న, అన్ని మండలాల తహసీల్దార్‌లు, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టిసారిస్తూ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. జనగామలోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌తో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంగళవారం సమావేశమై నియోజకవర్గ అభివృద్ధి గురించి పలు అంశాలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కడియం కోరిన విధంగా నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు అధికారులు సహకరించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్, ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న, సీపీఓ శ్రీనివాస్, పీఆర్ ఈఈ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పనివేళల్లో మార్పులు చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

జనగామ రూరల్: గురుకుల పాఠశాలల్లో పనివేళలు శాస్త్రీయంగా లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి గురై ఇబ్బందులు పడుతున్నారని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రావు అన్నారు. మంగళవారం యూటీఎఫ్ గురుకులం జాక్ ఆధ్వర్యంలో కలెక్టర్ రిజ్వాన్ బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 7 గంటలకు అల్పాహారం చేసి 1 గంట వరకు భోజనం చేయడంతో ఆకలికి ఉండలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉదయం 8 గంటల నుంచి 11.15 నిమిషాల వరకు విద్యార్థులు ఒకే చోట కూర్చోవడంతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. స్టడీ అవర్ పూర్తయిన తరువాత ఇంటికి చేరుకోవాలంటే ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం స్పందించి పని వేళల్లో మార్పులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, సుధీర్‌రెడ్డి, రవీందర్, కిషన్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయం పేరు మార్చొద్దు



కలెక్టర్‌కు వినతి చేస్తున్న ఆర్యవైశ్య ప్రతినిధులు

జనగామ: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును మారుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు పార్శి కమల్ కుమార్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జొన్నల రాజేశ్వరరావు ఆధ్వర్యంలో కలెక్టర్ రిజ్వాన్ బాషాను కలిసి వినతి చేసిన అనంతరం మాట్లాడారు. తమ మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉన్న ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకుని, యథావిధిగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ తొలి అధ్యక్షుడు మహంకాళి హరిశ్చంద్ర గుప్త, నాయకులు పజ్జూరి గోపయ్య, జైన రమేష్, బుచ్చిబాబు, గంగిశెట్టి ప్రమోద్, బుక్క రామయ్య, పాలకుర్తి సోమశేఖర్, మాశెట్టి వేణుగోపాల్, తుమ్మలపల్లి సోమేశ్వర్, గజ్జి సోమయ్య, రామిని శివరాజు, కూరెల్లి ఉపేందర్, మార్యాల అశోక్, బెజగం భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పత్తి పంటలో సూచనలు ఇస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

పాలకుర్తి: పత్తి, వరి పంటలకు ఇటీవల కురిసిన వర్షాలకు వ్యాధులు సోకాయని, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ పరశరాం నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని బమ్మెర గ్రామంలో జిట్టబోయిన నర్సింహకు చెందిన పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ పత్తిలో నల్ల మచ్చ తెగుల సోకడం, రసం పీల్చు పురుగులు, కాయ కుళ్లు తెగులు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 30 గ్రాములు, ప్లాంటామైసిన్ లేదా స్ట్రెప్టోసైక్లిన్ 1 గ్రాము 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. వరి పంటలో ఎండు తెగులు, సుడిదోమని నివారణకు బ్యాఫ్రెఫెజిన్ 16 మిల్లీ లీటర్లు, ఎసీఫేట్, ఇవాండక్లోఫెడ్ మిశ్రమ మందు 15 గ్రాములతో పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి రేపాల శరత్‌చంద్ర, ఏఈఓ రాధిక తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓల నియామకం

దేవరుప్పుల: ప్రతీ మండలానికి ఎఫ్‌ఏసీ ఎంఈఓలను నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఏ మండలంలో సీనియర్ పీజీ హెచ్‌ఎం ఉన్నారో అదే మండలానికి ఎఫ్‌ఏసీ (ఫుల్ అడిషనల్ చార్జ్) ఎంఈఓగా నియమిస్తూ జాబితా విడుదల చేశారు. ఈ మేరకు జిల్లాలోని 12 మండలాలకు ఎంఈఓలను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. జనగామ ఎఫ్‌ఏసీ ఎంఈఓగా వంగాల రాజేందర్, డి.గోవర్ధన్(చిల్పూరు), ఎం.ఐలయ్య(నర్మెట), ఐ. వెంకటరెడ్డి (బచ్చన్నపేట), జి. కళావతి (దేవరుప్పుల), జి.కొమురయ్య (స్టేషన్‌ఘన్‌పూర్), వై. గ్రేస్ క్రిజియారాణి (కొడకండ్ల), పి.విష్ణుమూర్తి (లింగాలఘణపురం), పి.నర్సయ్య (పాలకుర్తి), పి.రఘునందన్‌రెడ్డి (రఘునాథపల్లి), ఎన్.జానకి (తరిగొప్పుల), ఎండీ పర్వేజ్ (జఫర్‌గఢ్)లు ఎఫ్‌ఏసీ ఎంఈఓలుగా నేడు బాధ్యతలు తీసుకోనున్నారు.

నిజాయితీగా సేవలందించాలి

వరంగల్ క్రైం: వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు పోలీసు అధికారులు నిజాయితీగా సేవలందించాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. ఇటీవల శిక్షణ పూర్తి చేసుకొని వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు వచ్చిన 19 మంది ట్రెయినీ ఎస్సైలు మంగళవారం కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న సబ్ ఇన్‌స్పెక్టర్లను సీపీ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రత్యక్షంగా సేవలందించే అవకాశం పోలీసులకు మాత్రమే ఉంటుందని తెలిపారు.

డిగ్రీలో ఫెయిలయ్యానని.. విద్యార్థి బలవన్మరణం


దిలీప్ (ఫైల్)

రఘునాథపల్లి: డిగ్రీ పరీక్షల్లో ఫెయిలయ్యాననే మనస్తాపంతో ఓ విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం వెల్ది గ్రామానికి చెందిన రాపాక దిలీప్ (22) హనుమకొండలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశాడు. అందులో ఓ సబ్జెక్ట్‌లో ఫెయిల్‌కాగా సప్లిమెంటరీ రాశాడు.పరీక్ష ఫలితాల్లో మళ్లీ ఫెయిల్ కావడంతో జీవితంపై విరక్తి చెందిన దిలీప్ ఈ నెల 22న మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వ్యవసాయ పనులకు వెళ్లిన తల్లి విజయకు ఫోన్‌చేసి తాను పురుగుల మందు తాగినట్లు తెలపగా, భర్త పరుశరాములుతో కలిసి రోదిస్తూ ఇంటికి చేరుకున్నారు. అప్పటికే అపస్మారకస్థితికి చేరుకున్న దిలీప్‌ను జనగామ ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

పత్తికి ఆపతి..




పత్తి పంటను ఆశించిన పేను బంక, పచ్చ దోమ, తామర పురుగు

తెల్లబంగారానికి ఆశిస్తున్న రసంపీల్చే పురుగులు

- రైతులకు తీవ్ర నష్టం కలిగే అవకాశం
- సస్యరక్షణ చర్యలు చేపట్టాలి
- మల్యాల కేవీకే సమన్వయకర్త ఎస్.మాలతి, పంట ఉత్పత్తి శాస్త్రవేత్త కె.క్రాంతికుమార్
- అన్నదాతలకు పలు సలహాలు, సూచనలు

మహబూబాబాద్ రూరల్ : పత్తి.. తెల్లబంగారం. రైతుల ఇంట సిరులు కురిపించే పంట. అన్నదాతలకు అధిక లాభాలు అర్జించి పెట్టే ప్రధాన సాగు. అయితే ప్రస్తుతం పత్తి పంటను రసంపీల్చే పురుగులు ఆశించి తీవ్ర నష్టం కలుగజేస్తున్నాయి. ఈ క్రమంలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటను ఆ పురుగుల బారినుంచి రక్షించుకోవాలి. అప్పుడే పంట చేతికొస్తుంది. లేని పక్షంలో నష్టాల బారిన పడే అవకాశం ఉందని మహబూబాబాద్ మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎస్.మాలతి, పంట ఉత్పత్తి శాస్త్రవేత్త కె.క్రాంతికుమార్ అన్నారు. గత నెల, ఇటీవల కురిసిన వర్షాలకు పత్తిలో చీడపీడల ఉధృతి అధికం కావడం, ప్రధానంగా రసంపీల్చే పురుగుల ఉధృతి పెరుగుతున్నట్లు గమనించామని తెలిపారు. ఈ నేపథ్యంలో పంట రక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి రైతులకు వివరించారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..


డాక్టర్ ఎస్.మాలతి


కె.క్రాంతికుమార్

పేను బంక ..

పత్తి పంటకు పేను బంక ఆశించినప్పుడు లేత కొమ్మలు, ఆకుల అడుగు భాగాల నుంచి తల్లి, పిల్ల పురుగులు రసం పీల్చడం, ఆకులు దోనెలుగా మారడం, తేనె వంటి జిగురు పదార్థం విసర్జించడం వల్ల మొక్కల ఆకులపై నల్లని బూజు ఏర్పడుతుంది. పేను బంక నివారణకు ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మిల్లీ లీటర్లు, థయోమిథాక్సాం 0.2 గ్రాములను ఒక లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

పచ్చ దోమ ..

పత్తి పంటకు పచ్చ దోమ ఆశించి ఆకుల అడుగు భాగంలో పిల్ల, తల్లి పురుగులు చేరుతాయి. ఆకుల నుంచి రసం పీల్చుతాయి. తద్వారా ఆకుల ఈనెలు దోనెలుగా ముడుచుకుని పసుపు రంగులోకి మారుతాయి. పచ్చ దోమ నివారణకుగాను ఇమిడాక్లోప్రిడ్ లేదా ఫ్లోనికామైడ్ లేదా ఫిప్రోనిల్ 2 మిల్లీ లీటర్లను ఒక లీటర్ నీటికి లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు ఎసిఫేట్ 75 ఎస్.పీ 1.05 గ్రాములను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తెల్ల దోమ :

పత్తి పంటను తెల్ల దోమ పింద, కాయ దశలో ఆశిస్తుంది. ఆకుల మీద పచ్చదనం కోల్పోయి మచ్చలు ఏర్పడి, ఆకులు పెరగకుండా ముందే రాలిపోతాయి. పురుగు సోకిన మొక్కలు గిడసబారి పూమొగ్గలు, కాయలు రాలిపోతాయి. తెల్ల దోమ నివారణకు డైఫెన్ థయూరాన్ ఒకటి పాయింట్ 2.05 గ్రాములను లీటర్ నీటికి లేదా స్పైరోమెసిసిన్ మిల్లీ లీటర్ లేదా థయోమిథాక్సాం 0.2 గ్రాములు లేదా సల్ఫాక్సా ఫ్లోర్ 0.75 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పిండి నల్లి :

పత్తి పంటను పిండి నల్లి ఆశించినప్పుడు చిన్న పురుగులు లేత పసుపు రంగులో ఉంటాయి. తల్లి పురుగులు రెక్కలు లేకుండా మైనపు పూత కలిగిన వెంట్రుకలతో కప్పబడి ఉంటాయి. ఈ పురుగులు ఆకు తొడిమల నుంచి పూత, కాయల నుంచి రసం పీల్చడం వల్ల ఆకులపై పసుపు రంగు మచ్చలు ఏర్పడుతాయి. పిండి నల్లి నివారణకు ప్రొఫెనోఫాస్ 50 ఈ.సీ లేదా మిథైల్ పారాథియాన్ 50 ఈ.సీ ఎసిఫేట్ రెండు గ్రాములతోపాటు ట్రిటాన్ లేదా సాండోవిట్ లాంటి జిగురు మందులను ఒక మిల్లీ లీటర్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తామర పురుగు

పత్తి పంటకు తామర పురుగు ఆశించినప్పుడు తల్లి, పిల్ల పురుగులు సన్నగా పసుపు రంగులోకి మారుతాయి. ఆకు అడుగు భాగాన రసం పీల్చడం వల్ల ఆకులు పెలుసుగా మారుతాయి. ఆకుల అడుగున ఈనెల వెంబడి వెండి వలే మెరిసే చారలు కనిపిస్తాయి. తలమాడు తెగులు పత్తిలో తామర పురుగుల వల్ల వ్యాప్తి చెందుతుంది. తామర పురుగు నివారణకుగాను మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీ లీటర్లు లేదా ఎసిఫేట్ 75 ఎస్.పీ లేదా ఫిప్రోనిల్ 2 మిల్లీ లీటర్లను ఒక లీటర్ నీటికి లేదా డైఫెంథయూరాన్ 1.25 గ్రాములు లేదా స్పైనోటోరం 0.9 మిల్లీ లీటర్లను ఒక లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

నూతన పద్ధతులతో వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్

- నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ


జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న బిద్యాధర్ సుబుధీ

కాజీపేట అర్బన్ : నూతన పద్ధతులు అవలంబిస్తూ ప్రయోగాత్మకంగా వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ చేపట్టాలని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ తెలిపారు. నిట్ వరంగల్‌లోని సెమినార్‌హాల్ కాంప్లెక్స్‌లో మంగళవారం నిట్ వరంగల్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ, ఐఐటీ ఖరగ్‌పూర్, కెనడా మెక్‌గిల్ యూనివర్సిటీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన 'అడ్వాన్సెస్ ఇన్ బయోలాజికల్ వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ అండ్ ఇంటిగ్రేటెడ్ ఆఫ్ అకడమిక్ అండ్ రీసెర్చ్' అనే అంశంపై ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. బయోలాజికల్ వ్యర్థాల సేకరణలో మున్సిపాలిటీ పాత్ర కీలకమని, మురుగు నీటిని ఉపయోగకరంగా మార్చేందుకు ఆధునిక టెక్నాలజీని ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కెనడా మెక్‌గిల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ విజయ రాఘవన్, ప్రొఫెసర్లు శిరీశ్ హరి, పి.వి.రావు, సూరజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి ఆలయంలో అధికారుల తనిఖీ

- అమ్మవారికి సమర్పించిన నైవేద్యం, ప్రసాదం పరిశీలన
- నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచన


పులిహోర ప్రసాదాన్ని పరిశీలిస్తున్న అధికారులు

హన్మకొండ కల్చరల్ : తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యిని ఉపయోగించారనే అంశంపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నెయ్యిలో జంతు సంబంధిత కొవ్వు కలిసినట్లు తలెత్తిన ఆరోపణల సెగ నగరంలోని చారిత్రక శ్రీ భద్రకాళి దేవాలయానికి తాకింది. మంగళవారం శ్రీభద్రకాళి ఆలయాన్ని ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేశారు. ఈ మేరకు వరంగల్ జిల్లా ఆహార పరిరక్షణ అధికారి చేపూరి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆలయ ఈఓ శేషభారతితో కలిసి అధికారులు అమ్మవారికి నిత్యం సమర్పించే నైవేద్యం, ప్రసాదాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రసాదం, నైవేద్యాలు తయారు చేసే వంట గదుల శుభ్రత, లడ్డూ తయారీలో ఉపయోగించే నెయ్యి, ఇతర పదార్థాల గురించి ఈఓను అడిగి తెలుసుకున్నారు. కల్తీపై ఆరాతీశారు. వాటి నాణ్యత పరిశీలించిన అనంతరం శాంపిల్స్‌ను హైదరాబాద్‌లోని రాష్ట్ర ఆహార ప్రయోగశాలకు పంపించారు. భక్తుల విశ్వాసం చూరగొనేలా నాణ్యతకు పెద్ద పీట వేయాలని పలు సూచనలు చేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఆలయ ఈఓ శేషభారతి మాట్లాడుతూ అమ్మవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరగదని, నిత్యం శుభ్రం , నాణ్యతాప్రమాణాలు పాటిస్తున్నామన్నారు. గత ఫిబ్రవరి (2024)లో భారత ప్రభుత్వ ఆహారపరిరక్షణ ప్రమాణాల అధికారిక సంస్థ ప్రతినిధులు 'ఈట్ రైట్ ప్లేస్ ఆఫ్ వర్‌షిప్' సర్టిఫికెట్‌ను దేవాలయానికి జారీ చేశారని తెలిపారు. ఏపీ ఫెడరేషన్ విజయ కంపెనీ నెయ్యి వాడుతున్నామని, భక్తులకు నాణ్యమైన ప్రసాదాలు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.


ముడిసరుకులను పరిశీలిస్తున్న అధికారులు

వినియోగదారులకు శుభవార్త..

- తక్కువ ధరకు నాణ్యమైన విద్యుత్ పొదుపు చేసే ఉపకరణాలు
- ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ ద్వారా విక్రయాలు
- ఈ-కామర్స్ ద్వారా కొనుగోళ్లకు అవకాశం

హన్మకొండ: వినియోగదారులకు శుభవార్త. ఇక నుంచి కరెంట్ బిల్లుల మోత నుంచి ఉపశమనం పొందొచ్చు. విద్యుత్‌ను ఆదా చేసే శక్తి, సమర్థవంతమైన ఉపకరణాలు కొనుగోళ్లకు విద్యుత్ మంత్రిత్వ శాఖ ఈ-కామర్స్ మార్కెటింగ్ సౌకర్యం కల్పించింది. ఈ ఉపకరణాలు తక్కువ ధరకు లభించడంతో పాటు విద్యుత్‌ను పొదుపు చేస్తాయి. వినియోగదారులను విద్యుత్ పొదుపు వైపునకు ప్రోత్సహించడానికి 5 స్టార్ రేటింగ్ కలిగిన ఉపకరణాలను 'ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్' అనే సంస్థ.. ఈ-కామర్స్ మార్కెటింగ్ ద్వారా విక్రయిస్తోంది. ఈ ఉపకరణాల కోసం ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. ఈ ఉపకరణాలు వినియోగించడం ద్వారా మూడు సంవత్సరాల్లో వీటి కొనుగోళ్లకు చేసిన పెట్టుబడిని విద్యుత్ పొదుపు రూపంలో పొందొచ్చని ఇంజనీర్లు చెప్పారు. ఎల్ఈడీ బల్బులు, ట్యూబ్ లైట్లు, ఇండక్షన్ స్టౌవ్, 5 స్టార్ బీఎల్‌డీసీ ఫ్యాన్లు, సూపర్ ఎఫిషియెంట్ ఎయిర్ కండీషన్ (ఏసీ)లు, ఎల్ఈడీ ఇన్వర్టర్ బల్బులు ఎనర్జీ ఎఫిషియెంట్ సర్వీసెస్ లిమిటెడ్ పోర్టర్‌లో అందుబాటులో ఉన్నాయి. వినియోగదారులు టీజీ ఎన్పీడీసీఎల్ డాట్ కామ్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి ఈఈఎస్ఎల్ హోమ్ పేజీలోకి వెళ్లి అందుబాటులో ఉన్న ఉపకరణాలు కొనుగోలు చేయొచ్చు. ఆర్డర్ చేసిన వస్తువులు నేరుగా ఇంటికి డెలివరీ అవుతాయి. వినియోగదారులు ఈఈఎస్ఎల్ హోమ్ పేజీలోకి వెళ్లి కావాల్సిన ఉపకరణాన్ని ఎంచుకున్న తర్వాత ఈ-మెయిల్‌తో లాగిన్ కావాలని కోరుతుంది. లాగిన్ కాగానే చిరునామా వివరాలు నమోదు చేయాలి. తర్వాత చెల్లింపులు చేసే విధానం చూపుతుంది. వినియోగదారుడు తనకు అందుబాటులో ఉన్న విధానంలో ఉపకరణానికి సంబంధించిన సొమ్ము చెల్లించగానే బుకింగ్ కార్యక్రమం పూర్తవుతుంది. ఆ తర్వాత నిర్ణీత సమయంలో వినియోగదారుడికి డెలివరీ అవుతుంది. అదే విధంగా ఈఈఎస్ఎల్ పేజీలో క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి కూడా ఆర్డర్ చేసుకునే వెసులుబాటు ఉంది.



ఈఈఎస్ఎల్ పోర్టల్‌లో విద్యుత్ ఉపకరణాలు (లోగో)

నాణ్యమైన విద్యుత్ ఉపకరణాల కొనుగోళ్లకు ఉత్తమ వేదిక



నాణ్యమైన విద్యుత్ ఉపకరణాల కొనుగోళ్లకు ఈ-కామర్స్ మార్కెటింగ్ ఉత్తమ వేదిక. ఎనర్జీ ఎఫిషియెంట్ సర్వీసెస్ లిమిటెడ్ పోర్టల్‌లో విద్యుత్ పొదుపు చేసే నాణ్యమైన, సమర్థవంతమైన విద్యుత్ ఉపకరణాలు అందుబాటులో ఉన్నాయి. విద్యుత్ పొదుపు చేయడమంటే డబ్బు పొదుపు చేసినట్లే. ఈఈఎస్ఎల్ పోర్టల్‌లో విద్యుత్ ఉపకరణాలు అందుబాటులో ఉన్నాయి. కావాల్సిన వినియోగదారులు సరసమైన ధరలకు కొనుగోలు చేసుకోవచ్చు. మన్నిక కలిగి ఉండడంతో పాటు విద్యుత్ బిల్లు ఆదా అవుతుంది. మరిన్ని ప్రయోజనాలు పొందొచ్చు.

\- కె.వెంకటనారాయణ, ఎన్పీడీసీఎల్ హనుమకొండ ఎస్ఈ

బెదిరించి.. సీక్రెట్‌గా వీడియో తీశారు

- పోలీసులకు ఫిర్యాదు చేసిన శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

జనగామ: జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై చేసిన హత్యాయత్నం ఫిర్యాదుకు సంబంధించి ముగ్గురు నాయకులు జనగామ ఆర్అండ్‌బీ అతిథి గృహంలో తనను బెదిరించి వీడియోలో మాట్లాడించారని అదే పార్టీకి చెందిన నాయకుడు రాహుల శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం సీఐ దామోదర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పదిహేను రోజుల క్రితం టీపీసీసీ కార్యదర్శి కంచె రాములు, మునిసిపల్, మార్కెట్ మాజీ చైర్మన్లు వేమెళ్ల సత్యనారాయణ, ఎర్రమల్ల సుధాకర్‌లు తనకు ఫోన్ చేసి జనగామకు పిలిపించారన్నారు. చాయ్ తాగేందుకు ఆర్అండ్‌బీ అతిథి గృహానికి తీసుకెళ్లి, డోర్ లాక్ చేసి బెదిరింపులకు దిగారన్నారు. ప్రతాప్‌రెడ్డిపై తాము చెప్పినట్టుగా మాట్లాడాలని ఒత్తిడి చేసినట్లు వివరించారు. లేకుంటే ఇక్కడి నుంచి కదిలే ప్రసక్తే లేదని భయభ్రాంతులకు గురి చేశారన్నారు. కంచె రాములును చంపేందుకు ప్రతాప్‌రెడ్డి తనకు రూ.25లక్షల సుపారీ ఇచ్చినట్లు చెప్పాలని బెదిరింపులకు దిగడంతో ఎలా బయటపడాలనే ఉద్దేశంతో తాను అలా మాట్లాడితే, దానిని సీక్రెట్‌గా వీడియో తీసి, బ్లాక్ మెయిల్ చేస్తున్నారన్నారు. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తనకు రూ.25లక్షలు సుపారీ ఇచ్చినట్లు పిటిషన్‌లో రాసిన సంగతి తనకు తెలియదని, మీడియాలో వచ్చిన తర్వాత ఖంగుతిన్నట్లు చెప్పారు. ముగ్గురు వ్యక్తులపై తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించి, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

కాంగ్రెస్‌లో వీడియోల పంచాయతీ..

జనగామ కాంగ్రెస్‌లో రెండు వర్గాల మధ్య నెల కొన్న వివాదం రచ్చకెక్కుతోంది. టీపీసీసీ కార్యదర్శి హత్యకు ప్లాన్ చేస్తూ.. డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి రూ.25 లక్షల సుపారీ ఆఫర్ చేశారని కంచె రాములుతో కలిసి అదే పార్టీకి చెందిన రాహుల శ్రీనివాస్‌రెడ్డి రెండు రోజుల క్రితం డీసీపీ రాజమహేంద్రనాయక్‌ను కలిసిన విషయం తెలిసిందే. 24 గంటలు గడవక ముందే సదరు నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి యూటర్న్ తీసుకుంటూ సోషల్ మీడియా వేదికగా మంగళవారం ఓ వీడియో రిలీజ్ చేశారు. 'ప్రతాపన్న (ప్రతాప్‌రెడ్డి) తనకు సుపారీ కోసం రూ.25లక్షలు ఆఫర్ చేశారనే వార్తల్లో నిజం లేదు.. ఆయనను రాజకీయంగా అణగదొక్కేందుకు యత్నం చేస్తూ బురద జల్లేందుకు కుట్రలు పన్నుతున్నారని' ప్రస్తావించారు. ఇదిలా ఉండగా డీసీపీకి ఫిర్యాదుకు ముందు మరోవర్గం శ్రీనివాస్‌రెడ్డి మాటలకు సంబంధించి వీడియోలను సోషల్ మీడియలో రిలీజ్ చేసింది. దీంతో రెండు వర్గాల మధ్య వీడియో రిలీజ్‌ల పంచాయతీ రచ్చకు దారి తీస్తోంది.

తొర్రూరు మాజీ సర్పంచ్‌కు మూడేళ్ల జైలు



తొర్రూరు: గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఓ మహిళతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన తొర్రూరు మాజీ సర్పంచ్ ధరావత్ రాజేశ్‌నాయక్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ స్థానిక జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి మట్ట సరిత మంగళవారం తీర్పునిచ్చారు. ఎస్సై ఉపేందర్ కథనం ప్రకారం.. 2013లో తొర్రూరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఉన్న రాజేశ్‌నాయక్ పంచాయతీ కార్యాలయంలో ఓ మహిళతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డాడు. విశ్వసనీయ సమాచారం మేరకు అప్పటి ఎస్సై రాయల వెంకటేశ్వర్లు పట్టుకుని కేసు నమోదు చేశారు. సీఐ రాజు విచారణ చేపట్టి చార్జ్‌షీట్ ఫైల్ చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన జడ్జి మట్ట సరిత .. మాజీ సర్పంచ్ రాజేశ్‌కు మూడేళ్ల జైలు, రూ.4 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

పిడుగుపాటుకు వృద్ధుడి మృతి

కొత్తగూడ: పిడుగు పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని బత్తులపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..గ్రామానికి చెందిన దుర్గం లక్ష్మయ్య(65) మొక్కజొన్న చేనుకు కోతుల కాపలాకు వెళ్లాడు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం వస్తుండడంతో ఇంటికి వెళుతున్న క్రమంలో పిడుగు పడి అక్కడికి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై కుశకుమార్ తెలిపారు.

రంగయ్యపల్లిలో ఇంటిపై పిడుగు..

- సుమారు రూ. 4లక్షల ఆస్తినష్టం


పిడుగుపాటుకు దగ్ధమైన సామగ్రి

ఎల్కతుర్తి: గాలిదుమారంతో కురిసిన భారీ వర్షానికి ఓ ఇంటిపై పిడుగుపడింది. ఈ ప్రమాదంలో ఇంట్లో సామగ్రితో పాటు నిత్యావసర వస్తువులు, దుస్తులు, నగదు మంటలో పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటన భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లిలో చోటు చేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎర్రబోజు రాధిక ఇంటికి తాళం వేసి తన తల్లిగారి ఊరికి వెళ్లింది. సోమవారం రాత్రి భారీ వర్షంతో పాటు పిడుగు ఇంటిపై పడింది. ఈ ఘటనలో గోడలు పగుళ్లు చూపడంతో పాటు ఇంట్లో ఉన్న సామగ్రి పూర్తిగా మంటల్లో దగ్ధమైంది. సామగ్రితో పాటు కొంత నగదు, బంగారం కాలిందని బాధితురాలు మంగళవారం కన్నీరుమున్నీరైంది. తమను ప్రభుత్వం ఆదుకుని ఆర్థిక సాయం అందజేయాలని వేడుకుంది. కాగా, పిడుగు పడిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

గంజాయి రవాణా ముఠా అరెస్ట్

- 187 కిలోల సరుకు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ తిరుపతిరావు


గూడూరు: పట్టుకున్న గంజాయితో పాటు కారును చూపుతున్న పోలీసులు

గూడూరు: భారీ ఎత్తున ఎండు గంజాయి రవాణా చేస్తున్న ముఠాను గూడూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని సర్కిల్ పోలీసు స్టేషన్‌లో సోమవారం సాయంత్రం మచ్చర్ల బస్ స్టేజీ వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీలో పట్టుబడిన గంజాయి వివరాలను డీఎస్పీ తిరుపతిరావు మంగళవారం వెల్లడించారు. రెండు కార్లు, 187 కిలోల ఎండు గంజాయితో పాటు, ముగ్గురు వ్యక్తుల అరెస్ట్ చూపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ యువత తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే దురుద్దేశంతో అక్రమ మార్గాల వైపు దారిమల్లుతోందన్నారు. ఈ క్రమంలో ఒడిశా నుంచి భద్రాచలం, మహబూబాబాద్, గూడూరు మీదుగా ముగ్గురు వ్యక్తులు రెండు కార్లలో హైదరాబాద్‌కు ఎండు గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారని తెలిపారు. ఆ గంజాయి విలువ సుమారు రూ. 46 లక్షల 76 వేలు ఉంటుందన్నారు. ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లా పులిమేటలకు చెందిన మండల నరేశ్, ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా కున్మ్రాస్‌కు చెందిన రాహుల్ మజుందార్, రాయ్‌పూర్ జిల్లా అచోచలికి చెందిన హరీశ్‌యాదవ్. ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లా పులిమేటలకు చెందిన బాపన్ అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి రెండు కార్లలో తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. బాపన్ పరారీలో ఉన్నాడని, నలుగురిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో గూడూరు సీఐ కె. బాబూరావు, ఎస్సై గిరిధర్‌రెడ్డి, కొత్తగూడ ఎస్సై కుశకుమార్, సిబ్బంది బిచ్చానాయక్, కుమారస్వామి, ప్రణీత్, అమ్రు, సైదులు, నార్కోటిక్ డీఎస్పీ డి. సురేశ్, సీఐ బి. రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురు గంజాయి నిందితుల రిమాండ్

వర్ధన్నపేట: గంజాయి రవాణా చేస్తూ సోమవారం వర్ధన్నపేట ఆర్టీసీ బస్టాండ్‌లో పట్టుకున్న నలుగురు వ్యక్తులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వర్ధన్నపేట సీఐ కె. శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బిహార్‌కు చెందిన వివేక్ కుమార్ మిశ్రా, ఢిల్లీకి చెందిన ధర్మేందర్ మలావర్, బాబీదేవి, ద్రౌపదిదేవి, రితీక కలిసి సులభంగా డబ్బులు సంపాదించాలనుకున్నారు. ఇందులో భాగంగా ఏపీలోని విశాఖపట్టణానికి చెందిన రవి నుంచి రూ. 6.85 లక్షల విలువైన 27.41 కేజీల ఎండు గంజాయి తీసుకుని ఢిల్లీకి చెందిన అరవింద్‌కు అప్పగించడానికి ఈ నెల 21వ తేదీన విశాఖ నుంచి హుజూర్ సాహెబ్ నాందేడ్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీకి బయలుదేరారు. ఈ నెల 22వ తేదీన ఉదయం కాజీపేట రైల్వే స్టేషన్‌లో సాయంత్రం పోలీసులు బోగీలు తనిఖీ చేస్తున్నారు. గమనించిన వీరు ఇదే రైల్వే స్టేషన్‌లో రైలు దిగారు. అనంతరం రితీక కాజీపేట నుంచి తప్పించుకుంది. మిగతా నలుగురు ఓ లారీలో బయలుదేరి వర్ధన్నపేట ప్రాంతానికి చేరుకున్నారు. రాత్రి నిర్మానుష్య ప్రదేశంలో గడిపి 23 తేదీన సికింద్రాబాద్ వెళ్లడానికి బ్యాగులు తీసుకుని వర్ధన్నపేట ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నారు. అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు తనిఖీ చేయగా ఎండు గంజాయి లభించింది. దీంతో నలుగురిని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని, పరారీలో ఉన్న రవి, రితిక, అరవింద్ కోసం గాలింపు చేపడుతన్నామని సీఐ కె. శ్రీనివాసరావు తెలిపారు.